ప్రజాశక్తి
సోమవారం 7 ఏప్రిల్ 2025
5
విజయనగరం





తాళిబొట్టును చూపిస్తున్న అర్చకులు

బొబ్బిలిలోని సబ్‌డివిజన్ కార్యాలయం

వ్యవసాయ శాఖ బొబ్బిలి సబ్‌డివిజన్ అవినీతికి అడ్డాగా మారిందా? వ్యవసాయ శాఖకు సంబంధించి నిధుల గోల్‌మాల్ జరిగిందా? రైతు సేవా కేంద్రాల నిర్వహణ నిధులు, సిబ్బంది ప్రోత్సాహకాల డబ్బులు పక్కదారి పట్టాయా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. నిత్యం పొలాల్లో ఉంటూ, రైతులకు సేవలందిస్తున్న సిబ్బందికి చేరాల్సిన నిధులు రూ.లక్షల్లో దారిమళ్లాయి. ఇందులో వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్ అధికారి, మండల స్థాయి అధికారి కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

వ్యవసాయ శాఖలో నిధులు గోల్‌మాల్

- బొబ్బిలి వ్యవసాయ కేంద్రంలో రూ.లక్షల్లో స్వాహా!
- ఆర్ఎస్‌కెలకు పైసా కూడా అందని వైనం
- విఎఎలపైనే నిర్వహణ భారం

ప్రజాశక్తి-బాడంగి

వ్యవసాయ శాఖ బొబ్బిలి సబ్‌డివిజన్ పరిధిలో బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, తెర్లాం మండలాలు ఉన్నాయి. సబ్‌డివిజన్ పరిధిలో 76 రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కె) ఉన్నాయి. అందులో బాడంగి మండలంలో 17 ఆర్ఎస్‌కెలు ఉన్నాయి. సబ్‌డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు, అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు మూణ్నాలుగేళ్లుగా చేరడం లేదన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. రైతు సేవా కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.2047 విడుదల చేస్తుంది. ప్రభుత్వం నిధులు విడుదల చేసినా, నాలుగేళ్లుగా రూపాయి కూడా రైతు సేవా కేంద్రాలకు రాలేదు. ఆర్ఎస్‌కె ఉద్యోగులే ఖర్చులు భరిస్తూ వస్తున్నారు. రైతు సేవా కేంద్రాల నిర్వహణ కోసం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం రూ.26.48 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులను ఎప్పటికప్పుడు జిల్లా వ్యవసాయాధికారులు సబ్‌డివిజన్ స్థాయి అధికారులకు చేరవేశారు. ఈ లెక్కన బొబ్బిలి సబ్ డివిజన్ పరిధిలో 76 రైతు సేవా కేంద్రాలకు రూ.18.66 లక్షలు విడుదలయ్యాయి. ఒక్క రూపాయి కూడా ఆర్ఎస్‌కెలకు అందకపోవడం గమనార్హం. కేవలం 2024-25లోనే కాదు, గత నాలుగేళ్లలో నిర్వహణకు పైసా కూడా నిధులు ఇవ్వలేదు. దీంతో విఎఎలు సొంత ఖర్చులతో ఎలాగోలా నెట్టుకొస్తున్నారు.

☞ ధాన్యం కొనుగోలు నిర్వహణ ఖర్చు నిమిత్తం ఒక్కొక్క క్లస్టర్‌కి సుమారుగా 5 వేలు నుంచి 6 వేల రూపాయలు ప్రభుత్వం చెల్లించాలి. కానీ ఇంతవరకు ఏ ఉద్యోగికీ అందలేదు.

☞ ప్రభుత్వం నుంచి వచ్చిన ఎరువులను రైతులకు విక్రయించినందుకు విఎఎలకు ప్రోత్సాహకాలను అందిస్తోంది. టన్ను యూరియాకు రూ.50, డిఏపి, ఇతర ఎరువులకు రూ.100 చొప్పున ప్రభుత్వం ఇస్తామని ప్రకటించింది. ఈ ప్రోత్సాహకాలు ఒక్కరికీ ఇవ్వక పోవడం గమనార్హం.

☞ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అవగాహన కల్పించేందుకు పొలంబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. వీటిని గ్రామ స్థాయిలో సాధారణంగా గ్రామ వ్యవసాయ సహాయకులే చేపడుతుంటారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.20,514 వరకు ఇస్తుంది. ఈ బడ్జెట్‌ను నిర్వాహకులకు అప్పగించాల్సి ఉంది. కానీ సబ్ డివిజన్ అధికారి నుంచి ఏ ఒక్కరికీ నిర్వహణకు నిధులు సరిగా విడుదల చేయడం లేదని తెలిసింది. దీంతో నిర్వహణ భారంగా మారుతోంది.

నిధులు ఏమయ్యాయి?

సాధారణంగా ఆర్ఎస్‌కెల నిధులకు సంబంధించి వ్యవసాయ శాఖ ఎడికి చెక్‌పవర్ ఉంటుంది. కానీ, నిధుల వ్యవహారమంతా వ్యవసాయ శాఖ ఎడితోపాటు మండల వ్యవసాయాధికారి సంయుక్తంగా చేపడుతుంటారు. బాడంగి మండలానికి సంబంధించిన నిధులకు బొబ్బిలి ఎడితోపాటు బాడంగి ఎఒ విడుదల చేయాలి. ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులను వ్యవసాయ శాఖ జిల్లా స్థాయి అధికారులు సబ్ డివిజన్లకు అందిస్తున్నారు. అనంతరం అక్కడి నుంచి ఆర్ఎస్‌కెలకు, అందులోని ఉద్యోగులకు ఒక్క రూపాయి కూడా విదల్చడం లేదు. దీంతో నిర్వహణ భారమంతా విఎఎలపై పడుతోంది. రూ.లక్షల్లో ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులు ఏమవుతున్నాయో అంతుచిక్కడం లేదు. మరోవైపు నిర్వహణ నిధులు, ప్రోత్సాహకాల గురించి ఎవరైనా సిబ్బంది అడిగితే, వారిపై ఎడి వేధింపులకు దిగుతున్నారు. ఆ ఉద్యోగిని లక్ష్యంగా చేసుకుని బూతుపురాణం అందుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.

☞ ఒక్కో రైతు సేవా కేంద్ర సిబ్బందికి పంట కోత ప్రయోగానికి రూ.150 చొప్పున ఇవ్వాల్సి ఉంది. ఏడాదికి ఒక్కో ఆర్ఎస్‌కె నుంచి నాలుగు ప్రయోగాలు చేపడుతుంటారు. ఈ నిధుల్లో గత నాలుగేళ్ల నుంచి ఆర్ఎస్‌కె సిబ్బందికి పైసా కూడా ఇవ్వలేదు.

☞ రైతుల పొలాల్లో భూసారాన్ని తెలుసుకుని, ఏ పంట సాగు చేసేందుకు అనుకూలంగా ఉంటుందో విఎఎలు సలహాలిస్తుంటారు. అందుకోసం మట్టి నమూనాలు సేకరించి, ల్యాబ్‌కు పంపిస్తుంటారు. ఒక్కో మట్టి నమూనా సేకరణకు రూ.50 చొప్పున విఎఎలకు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కేవలం బాడంగి మండలంలో సుమారు 1600 మట్టి నమూనాలు సేకరించారు. ఈ లెక్కన రూ.80 వేల వరకు ఉద్యోగులకు అందాలి. ఏ ఒక్కరికీ ఈ డబ్బులు ఇచ్చినట్లు కనిపించలేదు.

నిధులు మంజూరు చేశాం

పొలంబడి కార్యక్రమం నిర్వహణకు, మట్టి నమూనా సేకరణకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయ్యాయి. వాటిని ఇప్పటికే మంజూరు చేశాం. ఎరువుల విక్రయాల ప్రోత్సాహకాలు, ధాన్యం కొనుగోలుకు సంబంధించి నిధులు రాలేదు.

- వి.టి.రామారావు, వ్యవసాయ శాఖ జెడి

కల్యాణం.. కమనీయం

- కన్నుల పండువగా సీతారాముల కల్యాణోత్సవం
- పట్టువస్త్రాలను సమర్పించిన మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

పట్టువస్త్రాలను సమర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్ దంపతులు

రామతీర్థంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణ, భక్తుల జయజయ ధ్వానాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని వేలాది మంది తిలకరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున చిన్న తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దంపతులు.. సీతారాములకు పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. సంప్రదాయానుసారం ఆలయ అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, ఆయన తనయ, విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కలిసి స్వామివారికి మధుపర్కాలు సమర్పించారు. ఎప్పటిలాగే సింహాచలం వరాహ లక్ష్మీ నృసింహస్వామి క్షేత్రం నుంచి పట్టువస్త్రాలను, మంత్రి శ్రీనివాస్, విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు చేతుల మీదుగా, సింహాచలం ఇఒ సుబ్బారావు అందజేశారు. ఆలయ ప్రధానార్చకులు సాయి రామాచార్యులు, కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వివాహ ఉత్సవాన్ని హయగ్రీవాచార్యులు తదితర వేద పండితులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, ఆయన సతీమణి, మాజీ ఎంపి ఝాన్సీ లక్ష్మి, ఎమ్మెల్సీ సురేష్ బాబు, దేవాదాయ శాఖ డిసి సుజాత, ఎసి శిరీష, ఆర్‌డిఒ డి.కీర్తి, రామతీర్థం ఆలయ ఇఒ వై.శ్రీనివాస్, తహశీల్దార్ సుదర్శన్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు గ్రీవెన్స్

వినతులు స్వీకరించనున్న మంత్రి

ప్రజాశక్తి-విజయనగరం

కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరై, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయనున్నారు. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో తెలిపారు.

ఆస్పత్రిలో వైద్యుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

యువతికి మెరుగైన వైద్యం

ఎమ్మెల్యే కళావెంకటరావు

ప్రజాశక్తి-విజయనగరం

యువకుడి చేతిలో తీవ్రంగా గాయపడిన యువతి అఖిలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు.. వైద్యులకు సూచించారు. గరివిడి మండలం శివరాం గ్రామానికి చెందిన యువతి అఖిలపై యువకుడు దాడికి పాల్పడటంతో ఆమె విజయనగరంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆదివారం స్థానిక ఆస్పత్రిలో యువతి అఖిలను ఎమ్మెల్యే కళా వెంకటరావు పరామర్శించారు. అఖిల కోలుకుంటోందని ఆయన చెప్పారు. ఘటన జరిగిన వెంటనే పోలీసులు స్పందించారని తెలిపారు. ప్రశాంతంగా ఉండే చీపురుపల్లి నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు.

మద్యం, గంజాయి మత్తులో

మహిళలపై దాడులు

- అఖిలపై దాడిచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి
- ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ

మద్యం, గంజాయి మత్తులో మహిళలపై దాడులకు తెగబడుతున్నారని ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ ఆందోళన వ్యక్తంచేశారు. గరివిడి మండలం శివరాంలో యువతి అఖిలపై కత్తితో దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని ఐద్వా బృందం పరామర్శించింది. అనంతరం రమణమ్మ మాట్లాడుతూ రోజురోజుకూ మహిళలపై దాడులు పెరుగుతున్నాయని చెప్పారు. మొన్న విశాఖపట్నంలోని మధురవాడలో మహిళపై అత్యాచారం, అడ్డుకున్న తల్లిపై దాడి చేశారని తెలిపారు. ఇప్పుడు శివరాంలో యువతిపై దాడి చేశారని చెప్పారు. మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు చేయడం, గంజాయి విరివిగా యువతకు దొరకడం వల్ల ఇలా మహిళలపై దాడులు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా గంజాయి, మద్యం నియంత్రించాలని, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల కోసం సిపిఎం చొరవతో కదిలిన పేదలు

- పలుచోట్ల హామీలు, మరికొన్ని చోట్ల మీనమేషాలు
- ఈసారి తాడోపేడో అంటున్న పేదలు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇళ్లు, ఇళ్ల పట్టాలు, ఇళ్ల అప్పగింత విషయమై సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన ఆందోళన కార్యక్రమాలకు పేదలు పెద్ద ఎత్తున కదిలారు. దిగివచ్చిన అధికారులు పేదలకు న్యాయం చేస్తామంటూ హామీలు ఇవ్వగా, కొన్ని చోట్ల ఎప్పటి మాదిరిగానే చేస్తాం... చూస్తాం... అంటూ మీనమేషాలు లెక్కించారు. ఈసారి ఇళ్లపట్టాలు ఇవ్వకపోతే తాడోపేడో తేల్చుకుంటామని పేదలు అంటుండగా, పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని సిపిఎం నాయకులు హెచ్చరిస్తున్నారు.

విజయనగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం శ్రేణులు, నగర ప్రజలు (ఫైల్)

గత నెలలో సిపిఎం నాయకులు జిల్లా వ్యాప్తంగా ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇళ్ల పట్టాలు, స్థలాల విషయమై విజయనగరం నగరంలోని పేదలు తమకు ఇళ్ల స్థలాలు అప్పగించడం లేదని, పట్టాలు మంజూరు చేయడం లేదని, ఇళ్ల మంజూరు కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నామని సిపిఎం నాయకుల బృందాన్ని చుట్టుముట్టారు. మరోవైపు వేపాడ మండలం గదబవలసలోనూ ఇళ్ల స్థలాల విషయమై పేదలు సిపిఎం నాయకులకు విన్నవించారు. ఇలా అనేక చోట్ల ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పట్టాల మంజూరు సమస్య ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో విజయనగరంలో పేదల నివాస స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలని, హుదూద్ బాధితులకు ఇప్పటికే కట్టించిన ఇళ్లను అప్పగించాలని, మిగిలిన అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ గత నెలలో సిపిఎం చేపట్టిన ధర్నాకు మంచి స్పందనే వచ్చింది. వందల సంఖ్యలో పేదలు కదిలారు. తహశీల్దార్ కార్యాలయాన్ని చుట్టుముట్టారు. వినతి తీసుకున్న తహశీల్దార్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. వేపాడ మండలంలోని గదబవలస పేదలకు పట్టాలివ్వాలన్న డిమాండ్‌తో చేపట్టిన ఆందోళన మేరకు నేరుగా ఆ గ్రామానికి ఆర్‌డిఒ కీర్తి వెళ్లి మంజూరుకు హామీ ఇచ్చారు. ఇలా మరికొన్ని చోట్ల కూడా అధికారుల నుంచి హామీలు వచ్చాయి. విజయనగరంలో అధిక సంఖ్యలో పేదలు కదిలేందుకు కారణం లేకపోలేదు. వాస్తవానికి చాలా కాలంగా పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు. పాలకులు మారినప్పుడల్లా ఈ సమస్యను ఎన్నికల హామీగానే ఉపయోగించుకుంటున్నారు. ముఖ్యంగా రామకృష్ణానగర్, సుందరయ్యనగర్, ఎల్‌బిజి నగర్ తదితర చోట్ల సుమారు వెయ్యిమందికిపైగా పేదలు దశాబ్దాల తరబడి నివాసం ఉంటున్నారు. నగరంలో ఎంతో మంది ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుని రెగ్యులర్ చేయించుకుంటున్నప్పటికీ పేదలకు పట్టాలు ఇచ్చేందుకు పాలకులు మీనమేషాలు లెక్కిస్తూ వస్తున్నారు. తాజాగా ఇళ్ల స్థలాలు రెగ్యులర్ చేసేందుకు జిఒ 30 జారీచేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో పేదలు నివాస స్థలాలను రెగ్యులర్ చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది. అలాగే హుదూద్ ఇళ్లను, పేద, దిగువ మధ్యతరగతి ప్రజల కోసం టిడ్కో ఇళ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్నాయి. వాటిని లబ్ధిదారులకు అప్పగించేందుకు గతంలో వైసిపి, తాజాగా టిడిపి ప్రభుత్వాలు దొందూ దొందే అన్న చందంగా వ్యవహరిస్తున్నాయి. ఈనేపథ్యంలో పట్టణ పేదలు ఇళ్లు, ఇళ్ల పట్టాల కోసం సిపిఎం పిలుపుతో అధిక సంఖ్యలో కదులుతున్నారు. ఎస్.కోట, కొత్తవలస, ముఖ్యంగా బొబ్బిలి, రాజాం వంటి చోట్ల కూడా పేదలు ఈ సమస్యపై ఆందోళనకు సిద్ధమౌతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పేదలకు న్యాయం చేయకపోతే సిపిఎం నాయకత్వంలో పేదలు తాడోపేడో తేల్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందనడంలో సందేహం లేదు.

ఇంటర్‌లో వ్యాయామ విద్యకు మంగళం

- పీడీ పోస్టులు ఇతర సబ్జెక్టులకు మార్పు చేస్తూ ఆదేశాలు
- వ్యతిరేకిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల నేతలు
- క్రీడా కోటాలో ఉద్యోగాలకు దూరం కానున్న విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండే విధంగా ప్రవేశపెట్టిన వ్యాయామ విద్యకు నేడు టిడిపి కూటమి ప్రభుత్వం మంగళం పాడేందుకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు (పీడీ పోస్టులు)ను ఇతర సబ్జెక్టులకు మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వ్యాయామ విద్య ఇంటర్ స్థాయిలో లేకపోతే విద్యార్థులు ఉద్యోగ అవకాశాలకు దూరం కానున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటిన విద్యార్థులకు క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందిన వారున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేసే అవకాశం లేకుండా పోతుంది. ప్రభుత్వ నిర్ణయంపై వ్యాయామ ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్మీడియట్ విద్య ఉన్నతాధికారుల నిర్ణయంతో జూనియర్ కళాశాలల్లో వ్యాయామ విద్య దూరం కానుందనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇప్పటికే జూనియర్ కళాశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు లేక విద్యార్థులు క్రీడలకు దూరం అవుతున్నారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకుండా ఉన్న పోస్టులను మార్పు చేయడమంటే వ్యాయామ విద్య లేకుండా చేయడం తప్ప మరొకటి కాదు. ఇదే కొనసాగితే వ్యాయామ విద్య కలగానే మిగులుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వ్యాయామ విద్య అధ్యాపకుల పోస్టులను జోనల్ స్థాయిలో భర్తీ చేస్తారు. ఇటీవల ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ క్రితిక శుక్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 199 వ్యాయామ విద్య పోస్టులను ఇతర సబ్జెక్టు పోస్టులకు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పదోతరగతి వరకు ఎస్‌జిఎఫ్-14, 17 విభాగాల్లో విద్యార్థులు వివిధ క్రీడాంశాల్లో పోటీపడతారు. అనంతరం కళాశాల స్థాయిలో ఎస్‌జిఎఫ్ - 17, 19 విభాగంలో వివిధ క్రీడాంశాల్లో వారు తలపడుతుంటారు. అసోసియేషన్ మీట్లను జాతీయ స్థాయిల్లో ఆడడంతో వారికి క్రీడా ధ్రువపత్రాలు వస్తాయి. దీంతో క్రీడా కోటా కింద ఉద్యోగాలు పొందే అవకాశం లభిస్తుంది. అదే జూనియర్ కళాశాలల్లో వ్యాయామ విద్య అధ్యాపక పోస్టులను భర్తీ చేయకపోతే ఆ విద్యార్థులు క్రీడల్లో రాణించడం అసాధ్యం. దీంతో ఎస్‌జిఎఫ్-19లో పాల్గొనే ఇంటర్మీడియట్ విద్యార్థులకు క్రీడా భవిష్యత్తు అంధకారమవుతుందనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఇంటర్మీడియట్ విద్యార్థులకు వ్యాయామ విద్య ఎంతో అవసరమని క్రీడా విశ్లేషకులు చెబుతున్నారు.

ఇతర పోస్టులకు మార్పు చేయడం తగదు

జూనియర్ కళాశాలల్లో వ్యాయామవిద్య అధ్యాపకుల పోస్టులను ఇతర సబ్జెక్టులకు మార్పు చేయడం తగదు. రాష్ట్ర వ్యాప్తంగా 199 పోస్టులను ఇతర సబ్జెక్టులకు మారుస్తూ ఉత్తర్వులు ఇవ్వడం సరికాదు. ఈ ఉత్తర్వులతో కళాశాల స్థాయిలో క్రీడల్లో రాణించే విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతుంది. ఎంపిఇడి అర్హతతో ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను ఉద్యోగోన్నతి ద్వారా పోస్టులను భర్తీ చేయాలి.

- జి.లక్ష్మణరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు

క్రీడలకు విద్యార్థులను దూరం చేయడమే

రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో 199 పీడీ పోస్టులను రద్దు చేస్తూ ఇతర సబ్జెక్టులకు మారుస్తూ, పోస్టులను మళ్లించడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఈ విధంగా జూనియర్ కాలేజీలో వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను రద్దు చేయడం వల్ల విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేందుకు కూడా వెనుకడుగు వేసే అవకాశముంది. క్రీడా శిక్షణలు లేకుండా కాలేజీలు క్రీడాలోకానికి దూరంగా మారే అవకాశముంది. ఇంటర్ విద్యార్థులకు క్రీడలను ప్రోత్సహించేటట్లు ఉండాలి.

- ఎం.వెంకటనాయుడు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి

5 కేంద్రాల్లో అపరాల కొనుగోలు

- ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి
- త్వరలో ఎన్‌సిసిఎఫ్ బృందం రాక
- మొక్కజొన్న కొనుగోలుకు ప్రతిపాదనలు
- 'ప్రజాశక్తి'తో మార్క్‌ఫెడ్ డిఎం వెంకటేశ్వరరావు ముఖాముఖి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఐదు కేంద్రాల్లో అపరాలను కొనుగోలు చేస్తున్నామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నడిపేన వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ నుంచి అనుమతులు పొందామని స్పష్టం చేశారు. ఈ కేంద్రాల్లో అపరాలు విక్రయించుకోవాలంటే సంబంధిత పంట ఇ-క్రాప్‌లో తప్పక నమోదు కావాల్సి ఉంటుందన్నారు. పంట నాణ్యతను పరిశీలించి ధర నిర్ధారించేందుకు త్వరలోనే ఎన్‌సిసిఎఫ్ బృందం జిల్లాకు వస్తుందని చెప్పారు. మరోవైపు మొక్కజొన్న కొనుగోలుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని వివరించారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

» అపరాల కొనుగోలుకు తీసుకున్న చర్యలేమిటి.?

జెసి నాయకత్వంలో జరిగిన ప్రొక్యూర్‌మెంట్ కమిటీ సమావేశంలో ఐదు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. జామి మండలం విజినిగిరిలోనూ, గంట్యాడ, గజపతినగరం, బొబ్బిలి, సంతకవిటి మండల కేంద్రాల్లోనూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. రైతులు ఆయా కేంద్రాల్లో అపరాలను విక్రయించుకోవచ్చు.

» రైతులంతా ఈ కేంద్రాల్లో విక్రయించుకోవడానికి వీలు ఉంటుందా.?

కేవలం ఇ-క్రాప్‌లో నమోదైన పంట ఉత్పత్తులను మాత్రమే ఇక్కడ కొనుగోలు చేస్తారు. ఈ ప్రక్రియలో రైతుల ఇకెవైసి కూడా అత్యంత కీలకంగానే పరిగణనలోకి తీసుకుంటారు. మిగిలిన విస్తీర్ణంలోని ఉత్పత్తులను తీసుకునేందుకు సహజంగానే కంప్యూటర్ వ్యవస్థ నిరాకరిస్తుంది.

» ఇప్పటి వరకు ఎంత మేర అపరాలు సేకరించారు.?

వాస్తవానికి గత నెల 19, 20వ తేదీల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 80 మంది రైతులు 50 మెట్రిక్ టన్నుల మినుములు విక్రయానికి ముందుకు వచ్చారు. ఇందులో అత్యధికంగా 40 మంది రైతులు విజినిగిరి కొనుగోలు కేంద్రం పరిధిలోని వారే. వీరి వద్ద సుమారు 25 మెట్రిక్ టన్నుల మినుములు ఉన్నాయి. నాణ్యతను బట్టి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర వర్తిస్తుంది. మినుములు, పెసలు కలిపి జిల్లా వ్యాప్తంగా 3,500 మెట్రిక్ టన్నులు సేకరించవచ్చని అంచనాలు రూపొందించాం.

» ప్రభుత్వ మద్దతు ధర ఎంత? పంట నాణ్యతను ఏవిధంగా లెక్కిస్తారు.?



ఈ ఏడాది క్వింటా మినుములు రూ.7,400, పెసలు రూ.8,682 చొప్పున ప్రభుత్వం మద్దతుధర ప్రకటించింది. కొన్ని నాణ్యతా ప్రమాణాలను కూడా నిర్దేశించింది. 2024-25 రబీలో ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేస్తారు. ఇందులోనూ తేమ 2శాతం, వ్యర్థపదార్థాలు 2 శాతం, ఇంతర పంట గింజలు ఒక శాతం, దెబ్బతిన్న గింజలు 3శాతం, పగిలిన గింజలు 3శాతం, పూర్తిగా తయారు కాని గింజలు 3 శాతం, పురుగుపట్టిన గింజలు 3 శాతం చొప్పున మాత్రమే ఉండాలి. వీటిలో ఏ ఒక్కటైనా హెచ్చుతగ్గులు ఉంటే, ఆ మేరకు ధరలో వ్యత్యాసం ఉంటుంది.

» పంటల కొనుగోలులో మార్క్‌ఫెడ్ పాత్ర ఏమిటి.?

మార్క్‌ఫెడ్.. పంట ఉత్పత్తుల కొనుగోలులో నోడల్ ఏజెన్సీగానే పనిచేస్తుంది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని నాఫెడ్ లేదా ఎన్‌సిసిఎఫ్ (నేషనల్ కో-ఆపరేటివ్ కంజుమర్స్ ఫెడరేషన్) ద్వారా వారు కొనుగోలు చేస్తారు. మన జిల్లాలో ఎన్‌సిసిఎఫ్ ద్వారానే కొనుగోలు జరుగుతోంది. జాయింట్ కలెక్టర్ ఆదేశాల ప్రకారం వ్యవసాయ శాఖ లెక్కల ఆధారంగా పలు రకాల పంటల దిగుబడుల ప్రకారం జిల్లా స్థాయి కమిటీల్లో చేసిన నిర్ణయం మేరకు కొనుగోలు ప్రక్రియను ముందుకు నడిపించడమే మార్క్‌ఫెడ్ పని. ఈ మేరకు ఐదు కేంద్రాల ఏర్పాటుతోపాటు ఎన్‌సిసిఎఫ్ అధికారులను కూడా సంప్రదించాం.

» మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ ఎంత వరకు వచ్చింది.?

మన జిల్లాలో మొక్కజొన్న రెండు లేదా మూడో ప్రాధాన్యత పంటగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే జిల్లా స్థాయి పర్చేజింగ్ కమిటీ సమావేశం పలుమార్లు చర్చించింది. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయమై ఇప్పటికే ఎన్‌సిసిఎఫ్‌కి ప్రతిపాదనలు పంపాం. అక్కడి నుంచి మార్గదర్శకాలు అందగానే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ప్రక్రియను ముందుకు నడిపిస్తాం.

పోస్టర్ విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి కోరారు. స్థానిక ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాల వద్ద ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ ఆదివారం పోస్టర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను పేదలకు అందించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయన్నారు. జీవో 117 అమలుతో యుపి పాఠశాలలు మూత పడుతున్నాయని విమర్శించారు. జీవో 117ను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, కేశవరావు, కస్తూరి, శ్రీనివాస్, శంకరరావు, రామారావు పాల్గొన్నారు.

పేదింటి మహిళను ఆదుకున్న జనసేన

ప్రజాశక్తి - భోగాపురం

పేదింటి మహిళను జనసేన నాయకులు ఆదివారం ఆర్థికంగా ఆదుకున్నారు. భోగాపురం పంచాయతీ కొల్లిపేట గ్రామానికి చెందిన పెంటుమాని అంకమ్మకు సుమారు 65 ఏళ్ళు ఉంటాయి. ఉన్న ఒక్క కొడుకు ఎటో వెళ్ళిపోయాడు. దీంతో ఆమె ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న భోగాపురం గ్రామానికి చెందిన జనసేన నాయకులు పల్లంట్ల జగదీష్, రాంబాబు ఆమెకు 5వేలు రూపాయలు అందించారు. ఈమెకు పింఛను వచ్చే వరకు ప్రతి నెలా ఆర్థిక సాయం అందజేస్తామని జనసేన నాయకులు తెలిపారు.

గ్రామంలో ర్యాలీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

స్వచ్ఛభారత్‌పై అవగాహన

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని తాటిపాడు గ్రామంలో జిఎమ్ఆర్ ఐటి రాజాం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛత అంశంపై అవగాహన ర్యాలీ, శ్రమదానం నిర్వహించారు. గ్రామంలో ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలను, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత అని వాలంటీర్స్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల నినాదాలు ప్రజలను ఆలోచింపజేశాయి. అనంతరం నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్‌పియూపి స్కూల్ చుట్టూరా పేరుకు పోయిన చెత్తను, పిచ్చి మొక్కలను తీసివేసి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ చెత్తను తీసివేసి శుభ్రం చేయడం పట్ల గ్రామస్తులు వారిని అభినందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.వి.ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవలు అందించారు.

మట్టి తరలింపునకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

కొనసాగుతున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పోలిపల్లి రెవెన్యూ పరిధిలో లింగాలవలస కొండపై అక్రమ గ్రావెల్ తవ్వకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. శనివారం కూడా ఆలయం వెనుక భాగంలో తవ్వకాలు కొనసాగించారు. ఈ విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు దృష్టికి తీసుకు వెళ్లడంతో వారు వెంటనే స్పందించి అక్రమ తవ్వకాలు అడ్డుకున్నారని చెప్తున్నారు. సుమారు నాలుగు ట్రాక్టర్లు జెసిబిని పట్టుకొని అపరాధ రుసుం వేసినట్లు స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు దీనిపై పెద్దగా స్పందించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒక ప్రైవేట్ వ్యక్తి స్థలంలో ట్రాక్టర్ 1200 చొప్పున గ్రావెల్ అమ్మకాలు చెరుకుపల్లికి చెందిన వ్యక్తి చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై విఆర్ఒ సంతోషి మాట్లాడుతూ అక్రమ గ్రావెల్ తవ్వకాలపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో వెళ్లామన్నారు. ఇక్కడ మట్టి అక్రమంగా తవ్వితే కేసులు నమోదు చేస్తామని జెసిబి యజమానిని హెచ్చరించినట్లు ఆమె తెలిపారు.

నేడు, రేపు నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గంట్యాడ సమీపంలోని టోల్‌గేట్ వద్ద, అయ్యన్నపేట జంక్షన్ దగ్గర మధుపాడ పంపులైన్ లీకైన కారణంగా నగరంలో కొన్నిచోట్ల సోమ, మంగళవారాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కమిషనర్ నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులను చేపడుతున్న రీత్యా నీటి సరఫరాను పంపిణీ చేయలేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. 17, 19, 21, 22, 23, 24, 25, 38, 39, 41, 47 డివిజన్లలోని కొన్ని ప్రాంతాల్లో, 18, 39, 40 డివిజన్లలో పూర్తిగా రెండు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. మరమ్మతులు పూర్తయిన వెంటనే నీటి సరఫరాను యథాతథం చేస్తామని వివరించారు.

గొయిదిలో తడి, పొడి చెత్త పై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గొయిదిలో గల అన్ని గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్తపై ఇఒపిఆర్‌డి కె.సత్యం, పంచాయతీ కార్యదర్శి కె.సుదర్శనరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతిరోజు ఇంటింటా డోర్ టు డోర్ కలెక్షన్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి, పీసా ప్రతినిధులు, క్లాప్ మిత్రాలు డోర్ టు డోర్ సేకరించిన తడి, పొడి చెత్తను చెత్త సంపద కేంద్రానికి తరలించాలన్నారు. అనంతరం ఆ షెడ్ వద్ద తడి, పొడి చెత్త వేరుచేసి వర్మీ కంపోస్ట్ తయారీ చేశారన్నారు. ప్రస్తుతం 300 కేజీల పైగా వర్మీ అందుబాటులో ఉందని పంచాయతి సెక్రటరీ తెలిపారు. ఎవరైనా కావాలంటే ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయిస్తామని చెప్పారు.

రంగంపేట స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రంగంపేట, పనుగుపేట, కోట సీతారాంపురంలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లు సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి దాని ద్వారా ఆర్థిక వనరులను సేకరించి గ్రామాల అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణపై ముందుగా ప్రజలకు ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కామేశ్వరరావు, రోహిణి, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతపై మీమాంసం.!

- కలగానే జంతు వధశాల
- రోడ్లపైనే మేకలు, గొర్రెల వధ
- ముద్ర వేయని వైనం, తనిఖీలు శూన్యం

ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లి మేజర్ పంచాయతీలో ఉన్న మాంస ప్రియులకు నాణ్యమైన మాంసం అందకుండా మీ మాంసంగా మారిపోతోంది. ఒక్క చీపురుపల్లి పట్టణంలోనే సుమారు 30 దుకాణాల వరకు మటన్ కొట్టులున్నాయి. అయితే ఏ ఒక్క కొట్టులోనూ నాణ్యమైన మాంసం దొరకడం లేదంటూ పలువురు మాంసం ప్రియులు అంటున్నారు. ఆరుబయట రోడ్డుపైనే మేకలు, గొర్రెలను వధించి వ్యాపారులు మాంసం విక్రయాలు కొనసాగిస్తున్నారు. దీంతో పంచాయతీలో జంతువధ శాలను సంబంధిత అధికారులు నిర్వహించకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. పండగలు, ఫంక్షన్లు, సెలవు రోజుల్లో ప్రజలు భారీగానే మాంస విక్రయాలు చేస్తుంటారు. కొనుగోలు చేస్తున్న మాంసం నాణ్యత ఎంత అనేది వినియోగదారులు ప్రశ్నించుకుంటే సరైన సమాధానం దొరకదనే చెప్పాలి. ఎందుకంటే మేకలు, గొర్రెల మాంసం విక్రయాల్లో నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. వధించే మేకలు, గొర్రెలు రోగాలతో ఉన్నాయా, ఆరోగ్యకరమైనవేనా..అని పరీక్షించే పశు వైద్యాధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అసలు మేకలు, గొర్రెల మాంసం నాణ్యమైనది లేనిదీ ఒక ఎత్తైతే చీపురుపల్లి మేజర్ పంచాయతీకి మాత్రం ఇంచు మించు లక్ష రూపాయల వరకు ఆదాయాన్ని మేకల కబేళా రూపంలో సమకూరుతుంది. అసలు నిబంధనలు పాటించాల్సిన అధికారులు పాటించకుండా మేకల కబేళాల ద్వారా లక్షలాది

అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మేక, గొర్రె మాంసం

రూపాయలను వేలం ద్వారా ఎలా ఆర్జిస్తున్నారంటూ పలువురు విమర్శిస్తున్నారు.

ముద్ర ఎక్కడ?

నిబంధనల ప్రకారం జంతు వధశాలల్లో గొర్రెలు, మేకలను అక్కడ పశువైద్యులు పరీక్షించి ధ్రువీకరణ (ముద్ర) పొందాలి. ఆ మాంసాన్ని ఒక రోజు వ్యవధిలోనే విక్రయించాలి. కానీ పంచాయతీలో వధ శాలలు లేక, తనిఖీలు లేకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా అనారోగ్యం, కుంటు పడిన జీవాలను కోసి విక్రయిస్తున్నారంటూ పలు విమర్శలు వస్తున్నాయి. కొంత మంది వ్యాపారులు నిబంధనలను తుంగలో తొక్కి మిగిలిన మాంసాన్ని ఫ్రిజ్‌లో పెట్టి తరువాత రోజు విక్రయిస్తున్నారు. అనారోగ్యం పాలైన గొర్రెలను, మేకలను తీసుకొచ్చి వాటి మాంసాన్ని వినియోగదారులకు అంటగడుతూ ప్రజల ప్రాణాలతో వ్యాపారస్తులు చెలగాటం ఆడుతున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు.

తనిఖీలు శూన్యం

చీపురుపల్లి పంచాయతీ పరిధిలో ఆదివారం, మంగళవారం, బుధవారం, గురువారం, శుక్రవారాల్లో భారీగా మేకలను, గొర్రెలను వధిస్తుంటారు. రోజు రోజుకీ మాంసానికి గిరాకీ పెరగడంతో నాణ్యమైన మాంసం అందించాల్సిన వ్యాపారస్తులు ఇష్టారాజ్యంగా మాంస విక్రయాలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రోడ్ల పక్కనే జీవాలను వధించి దుమ్ము దూళిలోనే విక్రయాలు సాగిస్తున్నారు. ప్రైవేటు హొటళ్ళు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బిర్యాని సెంటర్లు చీపురుపల్లిలో ఉబ్బడిముబ్బడిగా ఏర్పాటు కావడంతో నాణ్యత లేని మాంసం కూడా క్షణాల్లో అమ్ముడుపోతోంది. అంతే గాకుండా కోవిడ్ తరువాత మాంస ప్రియులు ఎక్కువ కావడంతో మాంస విక్రయదారులు తన ఇస్టారాజ్యంగా అనారోగ్యం పాలైన గొర్రెలను, మేకలను వధించి విక్రయిస్తున్నారంటూ పలువురు అంటున్నారు. ఇప్పటికైనా మాంసం నాణ్యతపై అధికారులు దృష్టి సారించాలని పలువురు మాంస ప్రియులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

రైలు కిందపడి వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- చీపురుపల్లి

చీపురుపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు కిందపడి హెచ్ ప్రసాద్ (57) మృతి చెందారు. రైల్వే ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపిన వివరాలు ప్రకారం.. రాజాం మండలం బొద్దాం గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి శనివారం రాత్రి చీపురుపల్లి రైల్వే స్టేషన్ నుండి విజయవాడ బయలుదేరాడు. అయితే ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా మృతుడు ప్రసాద్ కుటుంబ పోషణ నిమిత్తం విజయవాడలోని ఒక హోటల్లో పనిచేస్తున్నట్టు స్థానికులు తెలిపారు.

ఉరేసుకొని బీహార్ వాసి మృతి

ప్రజాశక్తి - భోగాపురం

విమానాశ్రయం ఎల్అండ్‌టి లేబర్ కాలనీలో బీహార్ రాష్ట్రానికి చెందిన రాజ్ కుమార్ (25) అనే వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తోటి కూలీలందరూ పనికి వెళ్ళిపోయిన తరువాత తువ్వాలుతో ఉరివేసుకొని మృతి చెందాడు. మధ్యాహ్నం భోజనం కోసం వచ్చిన కూలీలు అందరు చూసి పోలీసులకు సమా చారం ఇచ్చారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాపారావు తెలిపారు.

జెసిబి, ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి- బొబ్బిలి: మండలంలోని దిబ్బగుడివలస సాలావారి చెరువులో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న జెసిబి, రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు ఆదివారం సీజ్ చేశారు. చెరువులో గ్రావెల్ తవ్వుతున్నట్లు సమాచారం రావడంతో తహశీల్దార్ ఎం.శ్రీను ఆదేశాలు మేరకు ఆర్ఐ కె.రాంకుమార్, విఆర్ఒలు దాడి చేసి జేసీబీ, రెండు ట్రాక్టర్లను పట్టుకుని తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జెసిబిని సీజ్ చేసిన అధికారులు

బంగారయ్యకు ఉగాది పురస్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తంగుడుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న శివుకు బంగారయ్యకు గ్లోబల్ ఫౌండేషన్ ఉగాది పురస్కారం అందజేసింది. ఆదివారం విజయవాడలో శివుకు బంగారయ్య మాస్టర్ సామాజిక సేవలతో పాటు ఉపాధ్యాయ రంగంలో సుదీర్ఘ కాలం పాటు సేవలు అందిస్తున్నందుకు గాను విశాఖకు చెందిన గ్లోబల్ ఫౌండేషన్ వారు గురుజ్యోతి ఉగాది పురస్కారాన్ని హోటల్ అలంకార్‌లో అందించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కాసంశెట్టి కృష్ణమూర్తి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో అవార్డు, సర్టిఫికెట్, గోల్డ్ మెడలు, షీల్డ్ సన్మాన పత్రం అందించారు.

నెల్లిమర్ల: అవార్డు అందుకుంటున్న బంగారయ్య

ఇద్దరికి సేవారత్న అవార్డు

కొత్తవలస: మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్, గ్లోబల్ ఫౌండేషన్ సంయుక్తంగా వైద్యాధికారి డాక్టర్ సింహాద్రి నాయుడు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావుకు సేవారత్న అవార్డులను ప్రదానం చేశారు. ఆదివారం విజయవాడలో హోటల్ అలంకార్ ఇన్‌లో అవార్డులను తమకు అందించినట్లు వైద్యాధికారి సింహాద్రినాయుడు తెలిపారు. వియ్యంపేట పిహెచ్‌సిలో పనిచేస్తున్న వీరికి అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో ప్రజలకి వైద్య సేవలు అందించినందుకు, కోవిడ్ టైంలో ప్రాణలకు తెగించి కోవిడ్ పరీక్షలు, కోవిడ్ వాక్సిన్ వేసినందుకు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు డెంగీ, మలేరియా, టీబీ, లేప్రోసి, వ్యాధి నిరోధక టీకాలపై అవగాహనా కల్పించినందుకు అవార్డు అందించినట్లు మదర్ థెరిస్సా ఫౌండేషన్ ప్రెసిడెంట్ కె. కృష్ణమూర్తి తెలిపారు. విజయవాడలో జరిగిన ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ అవార్డ్ గ్రహీత డాక్టర్ రూత్ మేరీ, డాక్టర్ న్యూటన్ ఫండ్, జ్యోతిష్య బ్రహ్మ కట్టా హరి తదితరులు పాల్గొన్నారు.

ఇనపకుర్తికి జాతీయ అవార్డు

ప్రజాశక్తి -పూసపాటిరేగ

పూసపాటిరేగ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న డ్రాయింగ్ టీచర్ ఇనపకుర్తి చిన్న సత్యనారాయణకు జాతీయస్థాయి ఆర్ట్ టీచర్‌గా అవార్డు అందుకున్నారు. విజయవాడకు చెందిన డ్రీమ్ అండ్ చిల్డ్రన్ అకాడమీ నిర్వహించిన 12వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 5వ తేదీన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ హార్కిటెక్చర్ విజయవాడ ఆడిటోరియంలో వికసిత్ భారత్‌లో భాగంగా మన ప్రకృతి మనం కాపాడుకుందాం పేరుతో ఆర్ట్స్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పూసపాటిరేగ ఉన్నత పాఠశాల చిత్రకళ ఉపాధ్యాయుడు చిన్న సత్యనారాయణని ఆహ్వానించి, అతను గత 30 సంవత్సరాలుగా చిత్రకళకు చేస్తున్న సేవలను గుర్తించి జాతీయస్థాయిలో ఉత్తమ చిత్ర కళా ఉపాధ్యాయునిగా (బెస్ట్ ఆర్ట్ టీచర్) అవార్డుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ డాక్టర్ రమేష్ శ్రీ కొండ, మాజ్యూమాలరీ డైరెక్టర్ కె. సుధీర్, కళా రత్న జయన్న పాల్గొన్నారు. తమ పాఠశాలకు చెందిన చిత్రకళ ఉపాధ్యాయుడు చిన్న సత్యనారాయణకి జాతీయ స్థాయి అవార్డు రావడంతో పాఠశాల హెచ్‌ఎం బి.శంకర్రావుతో పాటు సిబ్బంది ఇనపకుర్తిని అభినందించారు.

కిలోమీటర్ రోడ్డుకు నిధులిస్తే..

ఏడు కిలోమీటర్ల దూరం తగ్గినట్లే..

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామం నుంచి స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఇంటికి ఎల్‌కోట వెళ్లాలంటే సింగరాయి నుంచి జగ్గయ్యపేట రోడ్డుకు రెండు కిలోమీటర్లు, జగ్గయ్యపేట రోడ్డు నుండి సోంపురం జంక్షన్‌కు మూడు కిలోమీటర్లు, సోంపురం జంక్షన్ నుండి ఎమ్మెల్యే ఇంటికి రెండు కిలోమీటర్లు మొత్తం ఏడు కిలోమీటర్ల చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తుంది. అదే ఎమ్మెల్యే ఇంటికి వెళ్లాలంటే సింగరాయి గ్రామం నుండి కితన్నపేట గ్రామం వరకు ఒక కిలోమీటర్ రోడ్డుకు నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మిస్తే సింగరాయి గ్రామస్తులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని గ్రామ ప్రజలు ప్రజా ప్రతినిధులను అధికారులను కోరుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తే సింగరాయి నుండి విశాఖపట్నం వెళ్లే కూలీలకు అత్యవసర వైద్య సేవలకు ఉపయోగంగా

ఈ గట్టు మీద నుంచే రోడ్డు వేయాల్సి ఉంది..

ఉంటుందని కోరుతున్నారు. కేవలం ఒక కిలోమీటరు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తే చుట్టూ ఏడు కిలోమీటర్లు తిరగాల్సిన పని ఉండదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికే ఉన్న చెరువు గట్టు మీదుగా రోడ్డు వేస్తే సరిపోతుందని కోరుతున్నారు.

ఐదేళ్లు కావస్తున్నా పూర్తి కాదా?

ముందుకు కదలని సచివాలయ నిర్మాణ పనులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని నీలకంఠ రాజపురం అగ్రహారంలో ప్రజలకు గ్రామ సచివాలయ ద్వారా సేవలను అందించాలనే ఉద్దేశ్యంతో 45 లక్షల రూపాయలతో భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో సచివాలయ నిర్మాణాన్ని ప్రారంభించి ఐదేళ్లు పూర్తి కావస్తున్నా ఇప్పటికీ నిర్మాణం పూర్తి కాలేదు. చేసిన పనులకు బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలో నిలిపేశారు. దీంతో భవనం లోపలి పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు ఏపుగా పెరిగి అసాంఘిక కార్యక్రమాలకు, విష సర్పాలకు నిలయంగా మారింది. భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో సచివాలయ సిబ్బంది గత్యంతరం లేక పాత పంచాయతీ భవనంలోనే ఇబ్బందులు పడుతూ నిర్వహిస్తున్నారు. ఈ విషయంపై పిఆర్‌జెఇ ఆలీని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.


మధ్యలో నిలిచిపోయిన సచివాలయం

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కుమ్మర వీధి సీతారాముల ఆలయంలో కుమ్మరి శాలివాహన సంఘం, ఆలయ ధర్మకర్త ముర్కురి తాతబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 5వేల మందికి అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారికి సారె ఊరేగింపు రాత్రి 8 గంటలకి కళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన సంఘం కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మిమ్స్ రామాలయంలో మిమ్స్ చైర్మన్ అల్లూరి సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు ప్రత్యేక పూజలు చేసి నవమి వేడుకలు నిర్వహించారు. మండలంలోని గరికిపేటలో మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో 2వేల మందికి అన్నదానం చేశారు.

నెల్లిమర్ల: మొక్కలు చెల్లించుకుంటున్న అశోక్ గజపతిరాజు

బొబ్బిలి: అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

వేపాడ: మండలంలోని పలు గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలలో భక్తులు పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం భారీగా అన్న సమారాధన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, సర్పంచులు, ఎంపిటిసిలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిం: పట్టణంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆరిగంగయ్య మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో సీతారాముల కళ్యాణం చేసి అన్నదానం చేశారు. టిఆర్ కాలనీ, ఐటిఐ కాలనీ, రాజమహల్, గొల్లపల్లి, పాతబొబ్బిలి, మల్లమ్మపేట రామలయాలలో ప్రత్యేక పూజలు చేసి సీతారాముల కళ్యాణం చేశారు. పూజలలో ఎమ్మెల్యే బేబినాయన, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని సంకిలిలో సీతారాముల ఉత్సవమూర్తులను పలు వీధులలో ఆదివారం ఊరేగించారు. ఆదివారం నుంచి తొమ్మిది రోజులు పాటు సీతారాముల నవమి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నారు జనార్దనరావు, కమలమ్మ దంపతులు కళ్యాణ మహోత్సవాలు నిర్వహించారు.

'సీతం'లో ముగిసిన ఎఎడి వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఎంసిఎ విద్యార్థులకు ఐదు రోజులపాటు నిర్వహించిన ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ ముగిసింది. ట్రైనర్ మహంతి పృథ్వీ.. విద్యార్థులను పోటీ కోడింగ్‌పై చక్కగా తీర్చిదిద్ది కోడింగ్ కాంపిటీషన్‌లో పాల్గొనేలా ఆసక్తి పెంపొందించారు. విద్యార్థులు అనేక పజిల్స్ అభివృద్ధి చేశారు. కార్యక్రమంలో సీతం ప్రిన్సిపల్ ద్వివేదుల రామమూర్తి, కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రాధ, తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ పొందిన విద్యార్థులతో సీతం యాజమాన్య ప్రతినిధులు

తిరుమల మెడికవర్‌లో రోబోటిక్ సర్జరీ

ప్రజాశక్తి- విజయనగరం

జిల్లా కేంద్రంలో నాలుగు దశాబ్దాలుగా జిల్లా వాసులకే కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న తిరుమల మెడికవర్ మరో అడుగు ముందుకేసి హాస్పిటల్ అధినేత డాక్టర్ కొడాలి తిరుమల ప్రసాద్ ఆధ్వర్యంలో ఇప్పుడు అత్యాధునిక వైద్య పరికరాలతో రోబోటిక్ సర్జరీ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. అధునాతన సాంకేతికతను ఉపయోగించి, ఖచ్చితత్వంతో, వేగవంతంగా ఆరోగ్యపునరుద్ధరణ అందించడానికి వైద్యులు చేసే శస్త్రచికిత్సా విధానాన్నే రోబోటిక్ సర్జరీ అంటారని వైద్యులు చెబుతున్నారు. దీనిలో రోబోటిక్ సిస్టమ్, కంప్యూటర్ అసిస్టెన్స్, హై-డెఫినిషన్ 3డి విజువలైజేషన్ ఉపయోగిస్తారు.

రోబోటిక్ సర్జరీ ఎలా పనిచేస్తుంది

రోబోటిక్ ఆర్మ్స్ (రోబోటిక్ చేతులు) చిన్న కోతలు ద్వారా శరీరంలోకి ప్రవేశించి, అధిక ఖచ్చితత్వంతో శస్త్రచికిత్స చేస్తాయి. కార్మన్ శస్త్రచికిత్స చేస్తున్న వైద్యుడు కంప్యూటర్ కాన్సోల్ దగ్గర కూర్చొని రోబోటిక్ చేతులను నియంత్రిస్తుంటారు. రోగి శరీరాన్ని లోతుగా చూడటానికి, అధిక స్పష్టత కలిగిన 3డి కెమెరాను ఉపయోగిస్తారు. ఎండ్-ట్రిస్ట్ టెక్నాలజీ మానవ చేయికి సాధ్యంకాని కోణాలలో రోబోటిక్ చేతులు తిరగడానికి ఉపయోగపడుతుంది.


రోబోటిక్ వైద్యం నమూనా

రోబోటిక్ సర్జరీద్వారా రోగులకు కలిగే ప్రయోజనాలు

రోబోటిక్ సర్జరీ ద్వారా లాపరోస్కోపిక్ సర్జరీల కన్నా ఇంకా చిన్న ముళ్లు వేయవచ్చు. చిన్న కోతల వల్ల రక్తస్రావం తక్కువగా ఉంటుంది. రోగులకు శస్త్రచికిత్స అనంతరం నొప్పి తక్కువగా ఉంటుంది. సాధారణంగా రోగులు త్వరగా కోలుకుని, ఆసుపత్రిలో తక్కువ రోజులు గడుపుతారు. మానవ తప్పిదాలు తక్కువగా ఉండే అవకాశం ఉంది. రోగికి ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం లేదు

రోబోటిక్ సర్జరీ ద్వారా చేసే శస్త్ర చికిత్సలు

రోబోటిక్ సర్జరీ ద్వారా గాల్ బ్లాడర్ తొలగింపు, హెర్నియా సర్జరీ, అపెండిసైటిస్ సర్జరీ, ప్రోస్టేట్ క్యాన్సర్ సర్జరీ, గర్భాశయ క్యాన్సర్, కొలాన్, రెక్టల్ క్యాన్సర్ సర్జరీ, ప్రోస్టేట్ గ్రంధి తొలగింపు, కిడ్నీ ట్యూమర్ తొలగింపు, మూత్రాశయ క్యాన్సర్, గర్భాశయ తొలగింపు, ఎండోమెట్రియాలిసిస్ చికిత్స ఫైబ్రాయిడ్ తొలగింపు, గ్యాస్ట్రో ఇంటెస్టినల్ సర్జరీ, గాస్ట్రిక్ బైపాస్, గాస్ట్రో ఎసోఫేజియల్ రిఫ్లక్స్ డిసీజ్, కార్డియాక్, థొరాసిక్ సర్జరీ, హార్ట్‌వాల్వ్ రీప్లేస్‌మెంట్, లంగ్ క్యాన్సర్ సర్జరీ, రోబోటిక్ సర్జరీ

అందుబాటులోకి ఆధునాతన వైద్య విధానం


రోబోటిక్ సర్జరీ చేస్తున్న వైద్యులు తిరుమల ప్రసాద్

అనేక రకాల జబ్బులకు సమర్థమైన శస్త్ర చికిత్సను అందిస్తుంది. రోబోటిక్ సర్జరీ సాధారణ సర్జరీ కంటే ఎక్కువ ప్రయోజనం ఉండడంతో పాటు కచ్చితమైన ప్రయోజనాలను గమనించి చాలా మంది రోగులు ఇప్పుడు ఈ రోబోటిక్ సర్జరీ విధానాన్ని ఎంచుకుంటున్నారు. కాగా ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి విజయనగరం జిల్లా కేంద్రంలో తమ తిరుమల మెడికవర్ హాస్పిటల్‌లో అన్ని రకాల జబ్బులకూ మెరుగైన వైద్యం అందించాలనే ధృడ సంకల్పంతో ఈ రోబోటిక్ సర్జరీ విధానాన్ని అందుబాటులోకి తీసుక వచ్చామని ఈ అవకాశన్ని విజనగరం జిల్లా ప్రజలే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలు ఉపయోగించుకోవాలని డాక్టర్ కొడాలి తిరుమల ప్రసాద్ కోరారు.

పబ్లిక్ నోటీస్

నా క్లయింట్ విజయనగరం జిల్లా, విజయనగరం టౌను, తోటపాలెం రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర, బాలాజీనగర్, డోర్ నెం. 8-24-18/1, కాపురస్తులు ఆలపాటి బసవ కోటయ్య గారి కుమారుడు ఆలపాటి కృష్ణమూర్తి ఇచ్చిన బోగట్టాపై పబ్లిక్ నోటీసు.

నా క్లయింట్ తన యొక్క స్థిరాస్థికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు 2576/1971, తేది 31-7-1971, ఎస్ఆర్ఒ, విజయనగరం తన యొక్క పసుపురంగు బ్యాగులో పెట్టి విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ 02-04-2015వ తేదీన కూర్చోని ఉండగా పై వివరించిన డాక్యుమెంటుతో కూడిన బ్యాగ్ పోయినది. ఈ విషయంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ విజయనగరం వారికి తేది 07-04-2015న తెలియపరచగా వారు 09-04-2015న సదరు ఒరిజినల్ దస్తావేజు లభ్యం కాలేదని సర్టిఫికేట్ జారీ చేసినారు. సదరు ఒరిజినలు క్రయచీటి ఎవరికైనా దొరికన ఎడల మరియు కొనుగోలు చేయదలచిన ఎడల క్రింది పేర్కొన్న న్యాయవాదికి, పై ఎడ్రస్ వారికి అనగా ఆలపాటి కృష్ణమూర్తికి గాని తెలియచేయవలెను.

ఎన్.కె.రాజ్‌కుమార్
న్యాయవాది & నోటరీ,
కొత్తగ్రహారం,
విజయనగరం.
సెల్ :9440570108

విజయనగరం
తేది: 07-04-2025